ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు జిల్లా వార్తలు 5

గురువారం 18 జూలై 2024



బిత్తర లేపుతున్న కత్తెర





ఆత్మకూరు, జూలై 17: నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న పంటను రైతులు విస్తారంగా సాగు చేస్తారు. అయితే మొక్కజొన్నతో పాటు మరి కొన్ని పంటల పాలిట మహమ్మారిగా తయారైన కత్తెరపురుగు (స్పోడోప్టెరా - ఫ్రూజీపెర్డా) ఆశించకుండా తొలి నుంచే ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. లేకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వాస్తవానికి ఆఫ్రికా దేశాల్లో పంటలకు తీవ్ర నష్టం కలిగించిన లెపిడప్టరన్ జాతికి చెందిన ఈ పురుగు దేశంలో 2018లో తొలిసారిగా కరాటక రాష్ట్రంలో మొక్కజొన్న పైరుపై ప్రభావం చూపింది. ఆ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిసా రాష్ట్రాల్లో మొక్కజొన్న పంటపై తీవ్ర నష్టాన్ని కలిగించింది. ప్రత్యేకించి ఆత్మకూరు, నందికొట్కూరు వ్యవసాయ డివిజన్ల పరిధిలో మొక్కజొన్న పైరును కత్తెర పురుగు ఆశించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ప్రతిఏటా కత్తెర పురుగును నియంత్రించేందుకై కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రత్యేక దృష్టి సారించి రైతులను అప్రమత్తం చేస్తోంది. అయితే మొక్కజొన్న సాగుకు సంబంధించి విత్తన శుద్ధి మొదలుకుని పంట చేతికొచ్చే వరకు సస్యరక్షణ చర్యలు పాటించాలని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



మొక్కజొన్న దిగుబడులపై కత్తెర పురుగు ప్రభావం
దిక్కుతోచని స్థితిలో రైతులు
అప్రమత్తతోనే నియంత్రణ సాధ్యం



పంటపై కత్తెర పురుగు ప్రభావం ఇలా :

కత్తెర పురుగు లద్దె పురుగును పోలినట్లు ఉంటుంది. గుడ్డు దశ 3 నుంచి 7 రోజుల ఉండగా, లార్వా దశ 20 రోజుల వరకు ఉంటుంది.. రెక్కల పురుగు ఒకేసారి 900 నుంచి 1500 వరకు గుడ్లు పెడుతుంది. ఈదశలో ఎప్పుడూ ఆకలితోనే ఉంటూ విపరీతమైన తిండి తింటుంది. ఆ సమయంలో పంటపై కత్తెర పురుగు ప్రభావాన్ని చూపుతుంది. ప్రధానంగా కంకి, ఆకులను పురుగు పూర్తిగా తినేస్తోంది. కంకి సుడిలోకి ప్రవేశించి కంకి ఎదుగుదలను నిలిపివేస్తోంది. గుడ్డు దశలోనే కత్తెర పురుగును నియంత్రిస్తే పంటపై కత్తెర పురుగు ప్రభావాన్ని తగ్గించవచ్చు. కాగా మొక్కజొన్న సాగులేని చోట వరి, పత్తి, అపరాలు, జొన్న, సోయా, చెరకు, పొగాకు, కూరగాయల పంటలను కూడా కత్తెరపురుగు ఆశిస్తోంది.

పంట 15 రోజుల దశలో ఉన్నప్పుడు ఎకరాకు 10 ఫిరామోన్ ట్రాప్స్(లింగాకర్షక బుట్టలు) ఏర్పాటు చేస్తే పురుగు ఉన్నట్లయితే ఫిరామోన్‌ట్రాప్స్ వాటిని ఆకర్షించి నియంత్రించేందుకు దోహదపడుతోంది. అదేవిధంగా రక్షణ పంటగా ఆముదం, అంతర పంటగా మినుము, పెసర, పశువుల గడ్డి(నేపియర్ గ్రాస్) వంటి పంటలను సాగు చేయడం వల్ల కూడా పురుగు తీవ్రతను కట్టడి చేయవచ్చు. కాగా 25 నుంచి 30రోజుల వ్యవధిలో ఎసిఫేట్ లీటర్ నీటిలో ఒక గ్రామ్ చొప్పున కలిపి రెండు విడతల్లో పిచికారి చేయాలి.

పైరు వివిధ దశల్లో ఉన్నప్పుడు

అలాగే పంట 35 నుంచి 60రోజుల దశలో ఎకరాకు 60లీటర్ల నీటిలో 200గ్రాముల హిమామెప్టిన్‌బెంజోఏడ్‌ను కలిపి ఆ ద్రావణాన్ని మొక్క సుడుల్లో నింపడం వల్ల పురుగు నశించేందుకు అవకాశం ఉందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. లేక క్లోరాంతనిలిప్రోల్ (ఫర్టెర్రా, బెబివియా గుళికలు) ఎకరాకు 3 లేక4 కేజీల చొప్పున మొక్క సుడిలో నింపాలి. అదే క్రమంలో 80గ్రాముల హిమామెప్టిన్ బెంజోఏడ్‌ను 200లీటర్ల నీటిలో కలిపి పంటకు పిచికారి చేయాల్సిన అవసరం ఉంది. ఈవిధంగా పంటచేతికొచ్చే వరకు కత్తెర పురుగు ఆశించకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.



వ్యవసాయ డివిజన్ సాధారణ సాగువిస్తీర్ణం (హెక్టార్లలో)		
నందికొట్కూరు	-	15854
ఆత్మకూరు	-	16833
నంద్యాల	-	4783
ఆళ్లగడ్డ	-	5732
కోవెలకుంట్ల	-	1175
డోన్	-	833
మొత్తం		45210 హెక్టార్లు

జిల్లాలో 45,210 హెక్టార్లలో మొక్క సాగు సాధారణ సాగు విస్తీర్ణం


నంద్యాల జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 2.35లక్షల హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా అందులో 45,210 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాధారణ సాగు విస్తీర్ణం నమోదయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. వీటిలో ఆయా వ్యవసాయ డివిజన్ల వారిగా మొక్కజొన్న సాగు విస్తీర్ణం అంచనాలు ఇలా ఉన్నాయి.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

మొక్కజొన్న పంటను సాగు చేసే రైతులు కత్తెర పురుగు ఉధృతిపై తొలి నుంచే తగిన జాగ్రత్తలు పాటించాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన ప్రకారం విత్తన శుద్ధి మొదలుకుని పంట చేతికొచ్చే వరకు అప్రమత్తంగా ఉండి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. కత్తెర పురుగు నివారణ చర్యలపై ఇప్పటికే గ్రామాలను సందర్శించి రైతులకు అన్నివిధాలుగా అవగాహన కల్పిస్తున్నాం. నివారణ పద్ధతులు పాటిస్తే కత్తెర పురుగును నియంత్రించి అధిక దిగుబడులు పొందవచ్చు. రైతులు అనవసరంగా పంటకు వివిధ రకాల రసాయనాలను పిచికారి చేసి ఆర్థికంగా నష్టపోవద్దని సూచిస్తున్నాం. ఆయా పంట దశలకు సంబంధించి కత్తెర పురుగు నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణపై రైతులు అవగాహనతో ముందుకెళ్తే పెట్టుబడులను తగ్గించడంతోపాటు అధిక పంట దిగుబడులు పొందేందుకు అవకాశం ఉంటుంది.

- అంజనేయులు, వ్యవసాయ సహాయ సంచాలకుడు, ఆత్మకూరు

కత్తెర పురుగు నియంత్రణకు చేపట్టాల్సిన జాగ్రత్తలు



కంకి సుడుల్లో హిమామెప్టిన్‌బెంజోఏడ్‌ను కలిపిన ద్రావణాన్ని నింపుతున్న రైతులు

కత్తెర పురుగును నియంత్రించేందుకు తొలిదశ నుంచే తగు జాగ్రత్తలు పాటించాలి. ప్రత్యేకించి విత్తన శుద్ధితో కత్తెర పురుగును కట్టడి చేయవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇందుకోసం సైన్‌ట్రానిలిప్రోల్ 19.8శాతం, థయోమెథాగ్జామ్ 19.8శాతం మందుల్ని కిలో విత్తనానికి 4మి.లీ చొప్పున విత్తన శుద్ధి చేయాలి. లేనిపక్షంలో ఇమిడాక్లోప్రిడ్‌ను కేజీ విత్తనానికి 0.6గ్రాములతో విత్తన శుద్ధి చేయవచ్చు. ఆలాచేస్తే మొలక తర్వాత 2నుంచి3 వారాల పాటు పురుగు ఉధృతిని నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది. అయితే కత్తెర పురుగు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విత్తన కంపెనీలే మొక్కజొన్న విత్తనాన్ని విత్తన శుద్ధి చేసి మరీ విక్రయిస్తున్నారు. కాగా విత్తనం వేసిన ఓ వారంలోపు ఒక లీటర్ నీటిలో 5 మి.లీ వేపనూనెతో పంటపై పిచికారి చేయడం వల్ల కత్తెర పురుగును లార్వా దశ నుంచే నిర్మూలించవచ్చు. పంట పెరిగే కొద్ది సస్యరక్షణపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఒకవేళ పంట ఎదిగే దశలో కత్తెర పురుగు ఆశించినట్లయితే లీటర్ నీటిలో 0.5 గ్రాముల హిమామెప్టిన్‌బెంజోఏడ్ కలిపి పిచికారి చేయడం వల్ల పురుగు ఉధృతిని నివారించవచ్చు.



కత్తెర పురుగు నివారణపై ఆత్మకూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

మెరుగైన వైద్యం అందించండి

● ఇన్‌చార్జి కలెక్టర్ మౌర్య



పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని పరామర్శిస్తున్న జేసీ

కర్నూలు(హాస్పిటల్), జూలై 17: మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామంలో అతిసార బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య వైద్యులను ఆదేశించారు. వాంతులు, విరేచనాలతో అడ్మిట్ అయిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి చిన్న పిల్లల విభాగంలో చికిత్స పొందుతున్న సుంకేశ్వరి గ్రామానికి చెందిన అభిరామ్, ధనుష్ అనే చిన్నారులను బుధవారం రాత్రి పరామర్శించారు. మందులు కావాలంటే కొని ఇవ్వాలని, అవసరమయితే నెఫ్రాలజీ వైద్యులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం అంటు వ్యాధుల విభాగంలో చికిత్స పొందుతున్న ఇద్దరు బాధితులను ఇన్‌చార్జి కలెక్టర్ పరామర్శించారు. అతిసార కేసులు ఎక్కువగా వస్తే వైద్యులు పడకలు సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వాంతులు విరేచనాలతో బాధపడే వారు ఆలస్యం చేయకుండా తక్షణమే ఆసుపత్రిలో చేరాలన్నారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ హెచ్‌వోడీ డా. విజయానందబాబు, ఏఆర్‌ఎంవో వెంకటరమణ, శివబాల, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి పాల్గొన్నారు.

మళ్లీ చిరుతపులి కలకలం

● మహానందిలో మరోసారి సంచారం
● పంది పిల్లను నోట కర్చుకొని నల్లమలలోకి వెళ్లిన వైనం
● భయాందోళనలో భక్తులు, స్థానికులు



మహనంది, జూలై 17: మహానందిలో మరోసారి చిరుతపులి సంచారం కలకలం రేపింది. దీంతో భక్తులు, స్థానికుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. కొద్ది రోజులుగా చిరుతపులి సంచారం లేకపోవడంతో స్థానిక ప్రజలు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే బుధవారం తిరిగి చిరుతపులి మహానందిలో ప్రత్యక్షం కావడంతో జనం ఒక్కసారిగా బెంబేలెత్తిపోయారు. క్షేత్రానికి సమీపంలోని పార్వతీపురం కాలనీకి అత్యంత సమీపంలో ఉన్న మైదానం వద్ద చిరుతపులి పంది పిల్లపై దాడి చేసింది. స్థానికులు గమనించి కేకలు వేయడంతో పందిపిల్లను నోట కర్చుకొని నల్లమల అడవిలోకి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని ప్రజలు అటవీశాఖ అధికారులకు తెలపడంతో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి చిరుతపులిని బంధించాలని స్థానిక ప్రజలతోపాటు భక్తులు కోరుతున్నారు.

ఊరి రుణం తీర్చుకుంటా

ఒడిసా సీఈవో డాక్టర్ తిరుమలనాయక్



ఒడిసా సీఈవో తిరుమలనాయక్, ఆయన సోదరుడికి పూల బొకేలు ఇస్తున్న దృశ్యం

అవుకు, జూలై 17 : జన్మనిచ్చిన ఊరు రుణం తీర్చుకుంటానని ఒడిసా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) డాక్టర్ తిరుమల నాయక్ అన్నారు. మొహర్రం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బుధవారం కుటుంబ సమేతంగా ఆయన అవుకు వచ్చి తన స్నేహితుడు, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణనాయక్ ఇంట్లో బస చేశారు. అవుకు గ్రామానికి చెందిన తిరుమలనాయక్ ఒడిసా క్యాడర్ నుంచి ఐఏఎస్‌గా ఎన్నికై ప్రస్తుతం సీఈవోగా అత్యున్నత పదవి చేపట్టడంతో ఉదయం గ్రామ ప్రజలు ఆయనను కలుసుకొని అభినందించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పీర్ల చావిళ్ల వద్దకు, అవుకు గ్రామదేవత మూలమ్మ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా తిరుమలనాయక్ మాట్లాడుతూ తాను అవుకు ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు చదువుకున్నానని అన్నారు. పాఠశాలకు అవసరమయ్యే వనరులను సమకూర్చుతానన్నారు. మండలంలోని తండాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి మినరల్ వాటర్ ప్లాంట్లు నెలకొల్పుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌నాయక్, గుడిపాటి రామక్రిష్ణ, నంది, మిద్దె ప్రసాద్, జయనాయక్, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం

● వైభవంగా పీర్ల ఊరేగింపు ● షియా ముస్లింల మాతంతో రక్తసిక్తమైన బనగానపల్లె వీధులు



మంత్రాలయం మండలం మాధవరంలో ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు



పత్తికొండలో..



కోసిగిలో జరిగిన పీర్లను ఊరేగింపునకు అశేషంగా తరలి వచ్చిన జనం



నందవరంలో...

కర్నూలు/బనగానపల్లె, జూలై 17: ఉమ్మడి జిల్లాలో మొహర్రం వేడుకలు బుధవారం ముగిశాయి. కర్నూలు జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, గోనెగండ్ల, కోసిగి, నందవరం మండలాల్లో పీర్ల దేవుళ్ల ఊరేగింపు జరిగింది. అనంతరం పీర్లను నిమజ్జనం చేశారు. అలాగే నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలోని కర్బాలా మైదానంలో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన మహమ్మద్ ప్రవక్త మనుమలైన ఇమాం హసన్, ఇమాంహుసేన్, వారి కుటుంబ సభ్యుల మృతికి సంతాప సూచకంగా నిర్వహించే మొహర్రం విషాద ప్రార్థనా గీతాలతో ముగిసింది. పట్టణంలోని దొరకోటలోని పీర్ల వద్ద నవాబు వంశీయుల వారసులు మీర్ ఫజుల్ అలిఖాన్, వారి కుటుంబసభ్యులు, షియా ముస్లింలు శోకతప్త హృదయాలతో ప్రార్థనలు చేశారు. పలువురు షియా మతస్థులు దొరకోట వద్ద తలపై కత్తితో కోసుకొని అమరులైన ఇమాంహుస్సేన్ వారి కుటుంబ సభ్యులను స్మరించుకుంటూ, నల్లదుస్తులతో ఊరేగింపులో పాల్గొన్నారు. దీంతో బనగానపల్లె పట్టణంలోని వీధులు రక్తసిక్తమయ్యాయి. దొరకోట నుంచి పట్టణంలోని పోస్టాఫీసు, ఆస్థానం రోడ్డు, సర్కిల్ స్టేషన్, పాత బస్టాండు మీదుగా జుర్రేరువాగు వరకు ఊరేగింపు సాగింది. పట్టణంలోని మొత్తం 40 పీర్ల చావిళ్ల నుంచి పీర్లు దొరకోట పీర్ల వెంట రాగా సాయంత్రం జుర్రేరువాగుకు చేరుకున్నాయి. అక్కడ పీర్లను శుద్ధి చేసి తిరిగి పీర్ల చావిళ్లకు చేర్చారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు, పోలీసు సిబ్బంది భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



బనగానపల్లెలో మాతం నిర్వహిస్తున్న షియా ముస్లింలు



హొళగుందలో ఏటికి వెళ్తున్న పీర్ల దేవుళ్లు



కోడుమూరు మండలంలో...

రహదారులకు నిధులు కేటాయించండి: మంత్రి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, జూలై 17 : రాష్ట్ర, జాతీయ రహదారులకు నిధులు కేటాయించాలని కేంద్ర, రోడ్లు, రవాణా హైవే శాఖమంత్రి నితిన్ గడ్కరీని కలసి విజ్ఞప్తి చేసినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటన సందర్భంగా తిరుపతి విమానాశ్రమంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికినట్లు తెలిపారు. అనంతరం గడ్కరీతో చర్చించి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి హత్య

కర్నూలు, జూలై 17: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జలమండలి కార్యాలయ సమీపంలో శ్రీరాములు ఆచారి (34)ని మంగళవారం అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. తాడిపత్రికి చెందిన శ్రీరాములు ఆచారి గత కొద్ది రోజుల కింద కర్నూలు వచ్చాడు. పేపర్లు సేకరించుకొని వాటిని విక్రయిస్తూ జీవిస్తున్నాడు. రాత్రి కాగానే మద్యం తాగి ఫుట్‌పాత్ మీద పడుకుంటూ ఉంటాడు. ఈ నేపథ్యంలో ఈయనకు ఫాతిమా అనే మహిళతో పరిచయం ఏర్పడింది. ఆమె కూతురితో శ్రీరాములు ఆచారి అసభ్యకరంగా ప్రవర్తించినట్లుగా తేలడంతో రవి అనే వ్యక్తితో కలిసి ఫాతిమా శ్రీరాములు ఆచారి మీద రాళ్లతో దాడి చేసినట్లుగా పోలీసులు చెబుతున్నారు. బుధవారం తెల్లవారుజామున వీరి మధ్య ఘర్షణ జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఫాతిమా, రవి కూడా చెత్త పేపర్లు సేకరించుకొని జీవిస్తున్నారు. శ్రీరాములు ఆచారికి పరిచయం ఉన్న మద్దమ్మ అనే మహిళ ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఇంతియాజ్ బాషా ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మైనార్టీల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట

● రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్

బేతంచెర్ల, జూలై 16: మైనార్టీల సంక్షేమానికి టీడీపీ పెద్ద పీట వేసిందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం విజయవాడలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆత్మీయ సమావేశం ఎంహెచ్‌పీఎస్ అధ్యక్షుడు మహ్మద్ ఫరూక్ షుబ్లీ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో పాల్గొన్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, టీడీపీ రాష్ట్ర సీనియర్ ప్రస్తుత మైనార్టీ న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సృజనా చౌదరి, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ డీజీపీ వెంకటేశ్వరరావు మైనార్టీలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 2024 టీడీపీ మేనిఫెస్టో మైనార్టీలకు పెద్ద పీట వేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జనాబ్ మొహ్మద్ ఫరూక్ శుబ్లీకి అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

మహానంది, జూలై 17: మహానంది మండలం ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన రైతు కల్లె శ్రీనివాసులు(62) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ నెల 15వ తేదీన రైతు కల్లె శ్రీనివాసులు తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలేకోలేక బుధవారం మృతి చెందాడు. రైతు తనకున్న 5 ఎకరాలతో పాటు మరో 5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని అరటితోపాటు వరి సాగు చేసాడు. అయితే పంటలపై పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో పాటు సాగు కోసం రూ. 10 లక్షల మేర అప్పులు అయ్యాయి. అవి ఎలా తీర్చాలా అని మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

దొర్నిపాడు, జూలై 17: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలోని సుమలత (28) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. రామచంద్రాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన సుమలత మంగళవారం రాత్రి నిద్రపోయి, బుధవరం తెల్లారాక 7 గంటలైనా నిద్ర లేవకపోవడంతో బంధువులు గమనించి తలుపులు తట్టారు. ఎంతకి పలకకపోవడంతో తలుపులు తీసి చూడగా అక్కడే కింద పడి కనిపించింది. వెంటనే ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుమలత అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతురాలి అక్క జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సీఐ, ఎస్‌లపై సస్పెన్షన్ వేటు

బాలిక మిస్సింగ్ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారని చర్యలు



నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్



ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్

నందికొట్కూరు, జూలై 17: ముచ్చుమర్రిలో అదృశ్యమైన వాసంతి బాలిక కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఇద్దరు పోలీసు అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తూ కర్నూలు డీఐజీ విజయరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 7వ తేదీన వాసంతి కనిపించకుండా పోయిందని మద్దిలేటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. అయితే కేసు విచారణలో అలసత్వం వహించారని నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్, ముచ్చుమర్రి ఎస్ఐ జయశేఖర్‌లపై డీఐజీ చర్యలు తీసుకున్నారు. దీంతో వారిద్దరిపై సస్పెన్షన్ వేటు పడింది. విధులపట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో కూడా బ్రాహ్మణకొట్కూరు ఎస్.ఐగా విధులు నిర్వహిస్తున్న జయశేఖర్ ద్విచక్రవాహనాలను మార్పిడి కేసులో సస్పెండ్ అయ్యారు. తిరిగి ఇప్పుడు ముచ్చుమర్రి ఎస్.ఐగా కూడా సస్పెండ్ అయ్యారు. విజయభాస్కర్‌పై కూడా నందికొట్కూరు పట్టణ సి.ఐ.గా ఉన్న సమయంలో మల్యాల గ్రామానికి చెందిన యువకులను చితకబాదిన కేసులో ప్రజా సంఘాల నుంచి నిరసన సెగను ఎదుర్కొన్నారు.

ఎల్లెల్సీ రైతులకు తీపి కబురు

● తుంగభద్ర డ్యాం నుంచి నీటి విడుదల



తుంగభద్ర గేట్లకు ప్రత్యేక పూజలు చేసి ఎల్లెల్సీకి నీటిని విడుదల చేసిన టీబీపీ బోర్డు ఇంజనీర్లు

కర్నూలు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంతం ఎల్లెల్సీ ఆయకట్టు రైతులకు తీపి కబురు. బుధవారం తుంగభద్ర జాలశయం నుంచి కాలువకు నీటిని విడుదల చేశారు. తొలి ఏకాదశి పర్వదిన పురస్కరించుకొని శుభదినం కావడంతో టీబీపీ బోర్డు సెక్రటరీ ఓ.రామకృష్ణ, ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు తుంగభద్రమ్మకు ప్రత్యేక పూజులు చేసి కాలువ తూములు ఎత్తి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 39.71 టీఎంసీలు వరద చేరింది. 49,522 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వారం రోజుల్లో జిల్లా సరిహద్దుకు నీరు చేరే అవకాశం ఉంది. ఇప్పటికే బోరుబావుల కింద వరి నార్లు పెంచుకుంటున్న రైతులు వరి నాట్లకు సాగు సన్నాహలు చేస్తున్నారు. కాలువకు నీటిని విడుదల చేయడంతో ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, కోడుమూరు నియోకవర్గాల్లోని ఎల్లెల్సీ ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డ్యాంలో ఆశాజనకంగా వరద చేరుతుండడంతో తక్షణమే జిల్లా సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం ఏర్పాటు చేసి ఎల్లెల్సీ, కేసీ కాలువ కింద ఆయకట్టుకు ఎన్ని ఎకరాలకు సాగునీరు ఇస్తారు..? తేల్చాలని రైతులు కోరుతున్నారు.



వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఎస్పీ బిందు మాధవ్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త



శివుడికి అభిషేకం చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

● కిటకిటలాడిన వైష్ణవ ఆలయాలు ● గోదా గోకుల క్షేత్రంలో జిల్లా న్యాయాధికారి, ఎస్పీ పూజలు

కర్నూలు(కల్చరల్), జూలై 17: తొలి ఏకాదశి పండుగను బుధవారం ఉమ్మడి జిల్లాలో భక్తి శ్రద్ధలతో, ఘనంగా నిర్వహించుకున్నారు. వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేకంగా ఏకాదశి పూజలు, ప్రత్యేక అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణాలు, హోమాలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి ఉపవాసాలు పాటించారు.

● **కర్నూలు నగరంలో:** నగర శివారులోని గోదా గోకులం (శ్రీగోదా రంగనాథస్వామి) క్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆండాల్ సన్నిధిలో గోదమ్మకు నిత్య సేవా కైంకర్యం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారికి తిరుమంజన సేవ, అలంకారం, తిరుమాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి ఊంజల సేవ చేశారు. ఈ పూజాదికాల్లో జిల్లా ప్రధాన న్యాయాధికారి నేరేళ్ల శ్రీనివాసరావు, ఎస్పీ బిందుమాధవ్ పాల్గొన్నారు. గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు వారికి తీర్థ ప్రసాదాలు, చిత్ర పటాలు అందజేశారు.

● **సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో:** హరిహర క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయంలోని భవానీ సహిత రామలింగేశ్వర స్వామికి పంచామృతాభిషేకం చేశారు. వెంకటరమణ కాలనీలో ఆలయంలో, బి.క్యాంపులోని విజ్ఞాన మందిరంలో, పాతనగరంలోని చిత్తారివీధిలోని దేవాలయంలో, కేసీ కెనాల్ సమీపంలోని రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో, గుత్తి రోడ్డులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేశారు.



గోకుల క్షేత్రంలో స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

జీవో రద్దుకు చంద్రబాబు కృషి చేయాలి

● జీవో 4375 (ఈ) ఏపీకి ఉరితాడు
● రాజ్యాంగబద్ధ నీటి హక్కులను కాపాడాలి
● రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



నంద్యాల టౌన్, జూలై 17 : జీవో 4375 (ఈ) ఏపీకి ఉరితాడని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. ఈ జీవోను రద్దు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను బుధవారం నంద్యాలలోని సాగు నీటి సాధన సమితి కేంద్ర కార్యాలయంలో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ సాగు నీటి హక్కులకు విఘాతం కలిగించే విధంగా కేంద్రం తెచ్చిన గెజిట్ నోటిఫికేషన్ రద్దుకు సీఎం చంద్రబాబు కృషి చేయాలని కోరారు. కేంద్రం తెచ్చిన జీవోలోని నూతన విచారణ అంశాలతో, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ చేపట్టిన విచారణలో ఏపీ నీటి హక్కులకు విఘాతం కలిగించే దిశగా ప్రమాద ఘంటికలు స్పష్టంగా అగుపిస్తున్నాయని పేర్కొన్నారు. గెజిట్ నోటిఫికేషన్ జీవో 4375(ఈ) తేదీ 6-10-2023 రాష్ట్ర నీటి హక్కులపై తీవ్రమైన ప్రతికూల పరిస్థితులను కలగజేస్తుందని అన్నారు. బచావత్ ట్రిబ్యునల్ కృష్ణా జలాలను ప్రాజెక్టుల వారీగా పంపకం చేసిన విషయం తెలిసిందేనని, బచావత్ కేటాయింపులను సుప్రీంకోర్టులో కూడా మార్చడానికి వీలులేకుండా పార్లమెంట్ చట్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాజెక్టుల వారీగా నీటి పంపకాన్ని కొనసాగించాలని, ఏపీ విభజన చట్టంలో కూడా పొందుపరిచారని పేర్కొన్నారు. వీటన్నింటినీ కాదని ఏపీ సాగు నీటి హక్కులను కాలరాస్తూ కృష్ణా జలాల పునఃపంపిణీ ద్వారా తెలంగాణకు లబ్ధి చేకూరేలాగా కేంద్రం జీవోను తీసుకు రావడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నామని, తక్షణమే జీవోను రద్దు చేయించాలని కోరారు. విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం బ్రిజేష్ ట్రిబ్యునల్ ముందుంచిన 'స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్'కు ఏపీ ప్రభుత్వం సమాధానం ఇవ్వడానికి చివరి అవకాశంగా నాలుగు వారాల సమయాన్ని ఈ నెల 15న జరిగిన విచారణ సందర్భంగా ఇచ్చిందని అన్నారు. సీఎం చంద్రబాబు ఈ విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించి కేంద్రం తెచ్చిన రాజ్యాంగ విరుద్ధ గెజిట్ నోటిఫికేషన్ రద్దు దిశగా కృషి చేయాలని, రాష్ట్ర సాగునీటి హక్కులను కాపాడాలని సీఎంకు పంపిన లేఖలో పేర్కొన్నారు. తక్షణమే అఖిల పక్షాన్ని ఏర్పాటు చేసి జీవో రద్దు చేసే దిశగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై ఒత్తిడి తీసుకు రావాలని బొజ్జా దశరథరామిరెడ్డి చంద్రబాబుకు రాసిన లేఖలో పేర్కొన్నట్టు తెలిపారు.

అహోబిలంలో తొలి ఏకాదశి పూజలు



అహోబిలంలో ఉత్సవమూర్తులకు ఏకాదశి పూజలు చేస్తున్న వేదపండితులు

నంద్యాల, జూలై 17(ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బుధవారం ఉత్సవమూర్తులైన ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు వేదపండితులు తొలి ఏకాదశి పూజలు చేశారు. వేకువ జామునే ఉత్సవ మూర్తులను పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం వేదపండితులు వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి పండుగను గ్రామాల్లోని ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కర్నూలు, జూలై 17: నగరంలో ధర్మపేట సమీపంలో సునీల్ అనే వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యయత్నం చేశాడు. తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా పెండ్లమావి అనే గ్రామానికి చెందిన ఈయన బుధవారం మధ్యాహ్నం ఆత్మహత్నాయత్నం చేశాడు. ఈ ప్రమాదంలో అతడి రెండు కాళ్లు విరిగాయి. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి బాధితుడ్ని ఆసుపత్రికి తరలించారు. సునీల్ దగ్గర లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోవెలకుంట్ల, జూలై 17: మండల పరిధిలోని గుంజలపాడు గ్రామ సమీపంలోని ఆర్‌అండ్‌బీ రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పవన్‌కుమార్(23) మృతి చెందినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కోవెలకుంట్ల పట్టణానికి చెందిన హరికుమార్ కుమారుడు పవన్ కుమార్ మోటరు సైకిళ్‌పై గుంజలపాడుకు వెళ్లి తన పని ముగించుకొని తిరిగి కోవెలకుంట్లకు వస్తుండగా బైకు అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్ తలకు బలమైన గాయాలయ్యాయి. కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి హరికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సుంకేశ్వరిలో అదే పరిస్థితి

● ఇద్దరి చిన్నారులకు తీవ్ర అస్వస్థత
● కర్నూలు ఆసుపత్రికి తరలింపు

మంత్రాలయం, జూలై 17: మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో బుధవారం వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన దాదాపు 13 మందిని ఆదోని ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరు చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. మూడు రోజుల క్రితం ఈరన్న, అంజలి దంపతుల కూతురు జ్యోతి మృతి చెందగా.. మృతురాలి అన్న అభిరామ్ (4), ఎరుకులి రవి, అంజనమ్మల కుమారుడు ధనుష్ (8)లు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని కర్నూలు ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నారు. మెరుగైన వైద్య సేవలు ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ, డీఎల్‌డీవో నాగేశ్వరరావు, మండల వైద్యాధికారి గోవిందమ్మ, తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, డీటీ రాఘవేంద్ర, సర్పంచ్ ముకురన్న, వీఆర్వో ఆనంద్, కార్యదర్శి చిరంజీవిలు దగ్గరుండి వైద్యసేవలు అందిస్తున్నారు. 108 వాహనాన్ని అందుబాటులో ఉంచారు. సుంకేశ్వరిలో విజృంభించిన అతిసారాను అదుపులోకి తెచ్చేందుకు నిరంతర వైద్యశిబిరం కొనసాగుతుందని, ఇందులో ఎవరూ ఏ శాఖ అధికారి నిర్లక్ష్యం వహించినా చర్యలు తీసుకుంటామని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ హెచ్చరించారు. బుధవారం బాధితులకు అందుతున్న వైద్యసేవలను, పరిశుభ్రత, తాగునీరు సరఫరా, గ్రామ ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



వైద్యులకు సూచనలు ఇస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ




ఆదోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుంకేశ్వరి గ్రామ అతిసార బాధితులు

డేంజర్ డాగ్స్

● కుక్కల స్వైర విహారంతో బెంబేలెత్తిపోతున్న జనాలు





కుక్క కాటుకు గురైన ఆరేళ్ల బాలుడు రాము (ఫైల్)

ఆదోని, జూలై 17: ఆదోని పట్టణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో తిరగాలంటే ప్రజలు జంకుతున్నారు. రాత్రుల్లో ఇండ్లకు చేరుకోవాలంటే మరిన్ని ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులకూ కష్టాలు తప్పడం లేదు. నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లే విద్యార్థులను వెంటపడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వెళ్లే వారి వెంట పడుతున్నాయి. కొన్ని నెలలుగా వీటి బెడద ఎక్కువైంది. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. తాజాగా ఆదోనిలో వేరు వేరుగా జరిగిన కుక్కల దాడి ఒక బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని చిన్న మార్కెట్, శంకర్ నగర్, మున్సిపల్ ప్రధాన రోడ్డు, కౌడల్ పేట, రాజీవ్ గాంధీ నగర్, బోయగేరి, శుక్రవారపేట, జిమ్ సర్కిల్ తదితర కాలనీలో రాత్రి, పగలు అనే తాడా లేకుండా పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతున్నాయి. ఏ వీధి చూసినా కుక్కల గుంపులే కనిపిస్తున్నాయి. ఉదయం వాకింగ్ పోయేవారు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని వెంటపడి తరుముతున్నాయి. రెండు రోజుల క్రితం రాజీవ్ గాంధీ నగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న ఆరేళ్ల బాలుడు రాముపై కుక్క దాడి చేసింది. ఈ దాడిలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. తలపై కరవడంతో పరిస్థితి విషమించింది. దీంతో కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నా పట్టించుకునే పాలకులు, అధికారులే లేరని ప్రజలు వాపోతున్నారు. ఆరు నెలల్లో 1300 మందికి పైగా కుక్క కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు రికార్డులు చెబుతున్నాయి.

● **రాత్రి వేళల్లో చుక్కలే..**

ఉదయం వేళల్లో కంటే రాత్రి వేళల్లో కుక్కలు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ జనాన్ని భయాందోళనకు గురి చేస్తున్నాయి. రాళ్లు తీసుకొని కొట్టినా వెంటపడి తరుముతున్నాయి. అతి కష్టం మీద వాటి బారి నుంచి తప్పించుకుని ఇళ్లకు చేరుకునే సరికి చుక్కలు కనిపిస్తున్నాయని ఆయా కాలనీ వాసులు వాపోతున్నారు. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీశైలంలో మాస్టర్ ప్లాన్ పరిశీలన

శ్రీశైలం, జులై 17: శ్రీశైలం క్షేత్ర మాస్టర్‌ప్లాన్ పరిశీలనలో భాగంగా బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రంలోని పలు ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో మాస్టర్ ప్లాన్ నిపుణులు కేఎస్ఎస్ వీవీ ప్రసాద్, రాజేంద్ర, ఐఐటీ ప్రొఫెసర్ డా.శశిధర్, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామకృష్ణ, మురళీధరరెడ్డి పాల్గొన్నారు. రాబోవు 50 సంవత్సరాలలో భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణం, స్వామి, అమ్మవార్ల పాకశాల, లడ్డూ ప్రసాదాల తయారీ కేంద్రం మొదలైన ప్రదేశాలలో అగ్నిమాపక యంత్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టనున్నారు. రహదారులు, పార్కింగ్, తాగునీటి ప్లాంట్లు, పుష్కరిణి, ఉద్యానవనాలు, వసతి భవనాలు, కళావేదిక నిర్మాణం, శివసేవకుల వసతి భవనం మొదలైన వాటిపై కూలంకాషంగా చిర్చంచారు.

వైసీపీ దోపిడీపై త్వరలో శ్వేతపత్రం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత


మాట్లాడుతున్న గౌరు చరిత

కల్లూరు, జూలై 17: ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, భూదందాలు, సహజ వనరుల దోపిడీపై ప్రజలకు వాస్తవాలు తెలిసేలా సీఎం చంద్ర బాబు నాయుడు ఆధారాలతో సహా శ్వేత పత్రం విడుదల చేస్తున్నారని బుధవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని, వాటి విలువ రూ.35,576 కోట్లపైనే ఉంటుందని స్పష్టం చేశారు. ఇళ్లపట్టాల పేరుతో 10వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ.9750 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వైసీపీ నాయకుల నుండి ప్రతి రూపాయి వసూలు చేస్తామని గౌరుచరిత అన్నారు.

మంత్రిని కలిసిన బ్రాహ్మణ సంఘాల నాయకులు


మంత్రి టీజీ భరత్‌కు వినతి పత్రం ఇస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

కర్నూలు(కల్చరల్), జూలై 17: జిల్లాలో పేద బ్రాహ్మణులు, అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలో మౌర్యఇన్‌లో గల మంత్రి కార్యాలయంలో టీజీ భరత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు బ్రాహ్మణుల పురోగాభివృద్ధికి టీజీ భరత్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. దీనిపై మంత్రి టీజీ భరత్ స్పందిస్తూ సమయానుకూలంగా బ్రాహ్మణులు అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, బ్రాహ్మణ సంఘాల నాయకులు టీవీ రవి చంద్ర శర్మ, శ్రీనివాసరాజు, శ్యాంసుందర్ శర్మ, కిరణ్ కుమార్, సీవీ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

టీజీ భరత్‌ను కలిసిన ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

కర్నూలు(రూరల్): రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్‌ను బుధవారం లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కైలాస్‌నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కైలాస్‌నాయక్ మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శాలువకప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం రాష్ట్రంలో ఉన్న లంబాడీ జాతి ప్రజలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలను కైలాస్ మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి నాగరాజు నాయక్, శంకర్‌నాయక్, జయరాం నాయక్, రామాంజి నాయక్ ఉన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

పేద మహిళలకు చీరలు పంపిణీ చేసిన డాక్టర్ శంకర్‌శర్మ


పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(హాస్పిటల్), జూలై 17: మత సామరస్యానికి ప్రతీక మొహర్రం అని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ అన్నారు. మొహరం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో ఉన్న తన క్లినిక్‌లో నిరుపేద హిందు, ముస్లిం, మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మత సామరస్యం ఎంతో అవసరమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు, జూలై 17: గూడూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్ల పనులు జరుగుతుండటంతో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గూడూరు సబ్ డివిజన్ ఆపరేషన్ ఈఈ జేసన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడుమూరు, సి.బెళగల్, గూడూరు మండలాల పరిధిలోని 33/11కేవీ సబ్ స్టేషన్లలో అగ్రికల్చర్- ఫేజ్3 (వ్యవసాయ బోర్లు, బావులకు, గ్రామ పంచాయతీ నీటి సరఫరా) కోసం గురువారం ఉదయం 4 గంటల నుంచి కరెంటు కోత ఉంటుందని తెలిపారు.

పరిశుభ్రతపై అవగాహన

కర్నూలు(కలెక్టరేట్), జూలై 17: జిల్లాలోని గ్రామాల్లో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి, సీజనల్ వ్యాధుల, నివారణ చర్యల గురించి పంచాయితీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది వారానికి రెండుసార్లు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రతి నెల 2వ తేదీ నుంచి 5వ తేదీలోపు, 17వ తేదీ నుంచి 20వతేదీలోపు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, నీటి తొట్టెలను సిబ్బంది శుభ్రం చేయనున్నారు. 12వ తేదీ నుంచి 15వ తేదీలోపు, 27వ తేదీ నుంచి 30వ తేదీలోపు మురికి కాలువలు శుభ్రం చేయనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలలో పైపులైన్ లీకేజీలు లేకుండా 15 రోజులకొకసారి సిబ్బంది తనిఖీ చేయనున్నారు. ప్రతి శుక్రవారం ఫాగింగ్ చేయనున్నారు.

● పారిశుధ్యంపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: డీపీవో

జిల్లాలో పారిశుధ్యంపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు అన్నారు. పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు కచ్చితంగా నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సంబంధిత రిజిస్టర్ నిర్వహించారు. నీటి ట్యాంకులను పరిశుభ్రం చేసిన తర్వాత ప్రజల నుంచి స్వయంగా సంతకాలు తీసుకోవాలన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల ఔదార్యం

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 17: నంద్యాల జిల్లా కరివేన జడ్పీ హైస్కూల్‌లో పీడీగా పని చేస్తున్న గ్లోరి దయామణి భర్త అనారోగ్యంతో బాధపడుతూ హాస్పిటల్‌లో ఉన్న విషయాన్ని తెలుసుకున్న ఉమ్మడి జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులంతా దాదాపు రూ.లక్ష వరకు నగదును పోగు చేసి ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్థిక కార్యదర్శులు బుధవారం బాధితునికి అంద జేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జోసెఫ్ లక్ష్మయ్య, నంద్యాల జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా కార్యదర్శి రవికుమార్, చందూ నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో అగ్నిప్రమాదం

కర్నూలు, జూలై 17: నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో మద్దమ్మ అనే మహిళ ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. మద్దమ్మ స్థానికంగా లేబర్ మేస్త్రీగా పని చేస్తుంది. బుధవారం ఉదయం కొద్ది మంది దగ్గర రూ.5.50 లక్షల మేర అప్పు చేసి తీసుకువచ్చి ఇంట్లో ఉంచింది. ఆ తర్వాత కూతురుతో కలిసి పని నిమిత్తం బయటకు వెళ్లింది. మధ్యాహ్నం తర్వాత ఈ అగ్ని ప్రమాదం జరిగింది. ఇంట్లో ఉన్న వస్తువులతోపాటు నగదు కూడా కాలిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. మద్దమ్మ చెబుతున్న కథనాలపై పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తను ఎవరి దగ్గర అప్పు తీసుకుందో వివరాలు సేకరిస్తున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

» కమిషనర్‌కు మంత్రి ఆదేశం
» నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన టీజీ భరత్


ప్రజల సమస్యలను అడిగి తెసుకుంటున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జూలై 17: నగరంలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మంత్రి టీజీ భరత్ నగర పాలక సంస్థ కమిషనర్‌కు ఆదేశించారు. బుధవారం నగరంలోని 46వ వార్డు పరిధిలోని కేవీఆర్ కాలేజీ వెనుక ప్రాంతమైన బాబుజగ్జీవన్ రామ్ నగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కేవీఆర్ కాలేజీ నుంచి బంగారుపేట మీదుగా ఆనంద్ థియేటర్ వరకు ఉన్న రోడ్డు మార్గాన వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే నగరంలో ట్రాఫిక్ కష్టాలు తగ్గుతాయన్నారు. ఆ తర్వాత పాతబస్టాండ్‌లోని గోడ గడియారం ఆస్పత్రిని మంత్రి టీజీ భరత్ సందర్శించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. త్వరలోనే వైద్యుల నియామకం అయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట కార్పొరేటర్లు పరమేష్, తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు అబ్బాస్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు హమీద్, మారుతీశర్మ, సురేష్, సముద్రాల శ్రీధర్, రమేష్, జూటురు రవీ, గణేష్ సింగ్, తదితరులు ఉన్నారు.

ఎంపీ విజయసాయిరెడ్డిని అరెస్టు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే, ఏపీజేఎఫ్ నాయకులు

కర్నూలు(కల్చరల్), జూలై 17: జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని జర్నలిస్టు యూనియన్ నాయకులు అన్నారు. బుధవారం ఏపీయూడబ్ల్యూజే, ఏపీజేఎఫ్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ సమితి సభ్యుడు కే నాగరాజు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజి, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం (ఏపీజేఎఫ్)జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, సాయికుమార్ నాయుడులు మాట్లాడారు. జర్నలిస్టులపై విజయసాయిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తప్పుబట్టారు. విజయసాయిరెడ్డి వ్యక్తిగత జీవితంపై మదన్ అనే వ్యక్తి ఆరోపణలు చేస్తే ఖండించాల్సిందిపోయి జర్నలిస్టులను దూషించడం తగదన్నారు. విజయసాయిరెడ్డి రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని అనంతరం మహాత్ముని విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో హరికిషన్, సురేష్, సుంకన్న, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎంపీ విజయసాయి వ్యాఖ్యలు అనుచితం

కోడుమూరు(రూరల్): వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి జర్నలిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని విలేకరులు మండిపడ్డారు. బుధవారం కోడుమూరులో విలేకరులు కోట్ల సర్కిల్ నుంచి ర్యాలీగా గాంధీ విగ్రహం వరకు చేరుకున్నారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వీరికి పలు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా విలేకరులు, నాయకులు మాట్లాడుతూ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రెస్‌మీట్‌లో విలేకరులపై అమర్యాదగా మాట్లాడమే కాకుండా సమావేశంలో లేని వారిపై చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమని అన్నారు. ఎంపీపై తక్షణమే చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విలేకరులు, టీడీపీ, సీపీఐ, సీఐటీ యూ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం


పెంచికలపాడులో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

గూడూరు, జూలై 17: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు బుధవారం ముగిశాయి. చివరి రోజు పీర్లను ఊరేగింపుగా ఏటికి తరలించారు. మండలంలోని గుడిపాడు, పెంచికలపాడు, కే.నాగులాపురం, బూడిదపాడు, చనుగొండ్ల గ్రామాల్లో మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గూడూరు ఎస్ఐ హనుమంతయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని కోడుమూరు, వర్కూరు, ప్యాలకుర్తి, పులకుర్తి, బైనదొడ్డి, గోరంట్ల, అనుగొండ, ముడుమలగుర్తి, క్రిష్ణాపురం తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు బుధవారం ముగిశాయి. మేళతాళాల మధ్య పీర్ల దేవుళ్లను ఊరేగించారు. చివరిరోజు చావిడిల నుంచి పీర్లను నిమజ్జనానికి తరలించారు. వేడుకలను తిలకించడానికి ఆయా గ్రామాల్లో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు. నిమజ్జనం అనంతరం ముస్లింలు విషాదగీతం ఆలపిస్తూ విచ్చేశారు.

కళ్లు లేని జీవితం అంధకారం

కర్నూలు(న్యూసిటీ), జూలై 17: కళ్ళు లేని మానవ జీవితం అంధకారమని సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకుడు ప్రసాద్‌శర్మ అన్నారు. బుధవారం సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, భరత్ హాస్పిటల్ సౌజన్యంతో ఉజ్వల, ప్రగతి మహిళా ఫెడరేషన్ అధ్వర్యంలో జంపాల అపార్ట్‌మెంట్ గెలాక్సీ స్కూల్‌లో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య స్ఫూర్తి కేంద్రం అధ్వర్యంలో ఇందిరా గాంధీ నగర్ సుందరయ్య భవన్‌లో ప్రతి రెండు నెలలకు ఒక్కసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్గీలు రుద్రమ్మ, జ్యోతి, పుణ్యవతి, శివలీల, మహేశ్వరి, ఎస్.ఉమాదేవి, సుశాంత్ పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథక నిర్మాణానికి భూమి పూజ


రక్షిత మంచినీటి పథకానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యేలు దస్తగిరి, గౌరు చరిత

కర్నూలు(రూరల్), జూలై 17: కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న విద్యుత్‌శాఖ భవన సముదాయంలో రక్షిత మంచినీటి పథక నిర్మాణానికి కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గౌరుచరితమ్మ, కర్నూలు మేయర్ బీవై రామయ్య బుధవారం భూమి పూజ చేశారు. స్థానిక బీక్యాంపులో ఎన్‌సీసీ క్యాంటిన్ సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి విద్యుత్ శాఖకు రూ.20లక్షల నిధులతో తాగునీటి పైపులైన్ నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యేలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దిన్నెదేవరపాడు సర్పంచు ఎం.మాధవస్వామి, టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక స్థానిక కార్పొరేటర్లు, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 17: ఎరుకుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో బుధవారం ఏకలవ్యుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏకలవ్యుడి చిత్రపటానికి రిటైర్డు స్పెషల్ కలెక్టర్ రామస్వామి, వైహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకుల రాజు, జిల్లా గౌరవాధ్యక్షులు కుమార్, బీసీ జనసభ నాయకులు శేషఫణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకలవ్యుడి ఆదర్శంగా తీసుకుని తమ సమస్యల పరిష్కారం కోసం అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ ఎరుకుల వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్లు ఎరుకుల వెంకటస్వామి, గున్నమార్క్, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుడు మద్దయ్య పాల్గొన్నారు.

జేబు దొంగ అరెస్టు

కర్నూలు, జూలై 17: నాలుగో పట్టణ పోలీసులు జుబేర్ అనే జేబు దొంగను అరెస్టు చేసి రూ.7వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. జుబేర్ ఈ నెల 15వ తేదీన ముసలన్న అనే వ్యక్తి ఆటోలో వెళ్తుండగా.. తోటి ప్రయాణికుని మాదిరిగా అతని పక్కనే కూర్చొని రూ.27వేల నగదు చోరీ చేశాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేశారు.

● పోలీసుల అదుపులో 9 మంది జేబు దొంగలు: నాలుగో పట్టణ పోలీసులు కొత్తబస్టాండు, బళ్లారి చౌరస్తా తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 9 మంది జేబు దొంగలను అదుపులోకి తీసుకున్నారు. వీరిని గురువారం తహసీల్దార్ ఎదుట హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేసీ కెనాల్, హంద్రీ నదులను శుభ్రం చేయాలి


మంత్రి టీజీ భరత్‌కు సమస్యను వివరిస్తున్న రామకృష్ణారెడ్డి

కర్నూలు(కల్చరల్), జూలై 17: నగరంలోంచి వెళ్లే కేసీ కెనాల్, హంద్రీ నదులను శుభ్రం చేయించాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని మౌర్య ఇన్‌లోగల మంత్రి కార్యాలయంలో వేదిక ఆధ్వర్యంలో ఐక్యవేదిక నాయకులు మంత్రి టీజీ భరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ఐదు రోజులుగా వేదిక సభ్యులు కేసీ కెనాల్, హంద్రీ నదీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి, సమస్యలను గుర్తించామని అన్నారు. కేసీ కెనాల్ మురికి నీటితో, గుర్రపు డెక్కలతో మరో మూసీ నదిగా మారిపోయిందని, కేసీ కెనాల్ పొడవునా కంచె ఏర్పాటు చేయాలని కోరారు. కేసీ కెనాలుకు అటూ ఇటూ చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కేసీ కెనాల్‌లోకి నేరుగా మురుగు నీరు కలుస్తున్న ధర్మపేట, బంగారుపేట, రామ్‌రహీంనగర్, షికారిపేట, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. ఆనంద్ సినీ కాంప్లెక్స్ వద్ద హంద్రీ నదిలో వేస్తున్న చెత్త డంప్‌ను తక్షణమే తొలగించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వేదిక నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేదిక కో కన్వీనర్ మనోహర్ మాణిక్యం, కార్యవర్గ సభ్యులు యోహాన్, సుంకన్న, జహంగీర్, రత్నం ఏసేపు, సుబ్బరాయుడు, రవికుమార్, శ్రీనివాసులు, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ బంగ్లాలో అధ్వానంగా మరుగుదొడ్లు

తలుపులు లేకపోవడంతో మహిళలకు ఇబ్బంది


బూత్‌బంగ్లా సర్జికల్ వార్డులో తలుపులు లేని మరుగుదొడ్లు

కర్నూలు(హాస్పిటల్), జూలై 17: రాయలసీమకే తలమానికంగా ఉన్న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటంతో రోగులు ఇబ్బందిపడుతున్నారని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కే. సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు జి.ఏసు తెలిపారు. బుధవారం వారు హాస్పిటల్‌లోని బూత్‌బంగ్లా మొదటి అంతస్థులో ఉన్న సర్జికల్ వార్డులు, ఎంఎస్-5 వార్డుల పరిధిలో ఉన్న మరుగుదొడ్లను వారు పరిశీలించారు. మహిళలకు, పురుషులకు రెండు మరుగుదొడ్లు ఉన్నాయ ని, వాటికి తలుపులు లేకపోవడం రోగులు ఇబ్బందిపడుతున్నారని అన్నారు. కలెక్టర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ దీనిపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి

గూడూరు, జూలై 17: గూడూరు నగర పంచాయితీ పరిధిలోని పడమర బీసీ కాలనీ చివరి వీధిలో పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని టీడీపీ మండల నాయకులు వీరకృష్ణగౌడు కోరారు. బుధవారం పడమర బీసీ కాలనీలోని డంప్‌యార్డు వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని టీడీపీ నాయకులు, కాలనీవాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో చెత్తాచెదారం పేరుకుపోయిందని అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు.

షరతులు లేకుండా నిరుద్యోగ భృతి ఇవ్వాలి

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు


మాట్లాడుతున్న శ్రీనివాసులు

కర్నూలు(న్యూసిటీ), జూలై 17: ఎన్నికల హామీలో భాగంగా నిరుద్యోగులకు ఎలాంటి షరతులు లేకుండా నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంగర శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి యువనేస్తం పేరుతో ఇస్తున్న నిరుద్యోగ భృతిపై ఎటువంటి షరతులు విధించకుండా నిరుద్యోగులందరికీ భృతి రూ.3 వేలు ఇవ్వాలన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా అనేక షరుతులు పెట్టడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం విధించిన నిబంధనలన్నీ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిమంది నిరుద్యోగులను భృతికి అనర్హులుగా చేసేందుకే పెట్టారాన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కనీస వయోపరిమితి 45 సంవత్సరాలు ఉండగా ముఖ్యమంతి యువనేస్తం నిరుద్యోగ భృతికి 35 సంవత్సరాల వయస్సు పెట్టడం సరికాదన్నారు. నిరుద్యోగ భృతికి రాష్ట్ర ప్రభుత్వం వయోపరిమితి పెంచాలని లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి బీసన్న, నాయకులు చంటి, సురేంద్ర, రాజశేఖర్, శివ, కృష్ణ, హుస్సేన్, భాష, ఖాసిం పాల్గొన్నారు.

నేటి నుంచి కుష్ఠు వ్యాధి గుర్తింపు

కర్నూలు(హాస్పిటల్), జూలై 17: కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం ఈ నెల 18 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు అడిషనల్ డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ వెల్లడించారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని జిల్లా క్షయ నియంత్రణ కేంద్రంలో జిల్లా న్యూక్లియస్ అధికారి డా. మల్లికార్జునరెడ్డి, డీపీఎంవో సుబ్రహ్మణ్యంతో కలిసి అడిషినల్ డీఎంహెచ్‌వో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అడిషనల్ డీఎంహచ్‌వో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 14 రోజులు ఈ క్యాంపెయిన్‌లో ఆశాలు, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి తిరిగి సర్వే చేస్తారన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 17: గ్రామ, వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కర్నూలు నగర పాలక సంస్థ వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శులు అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం రాష్ట్ర మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిలేటి మాట్లాడుతూ జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖకు చట్టబద్ధత కల్పించాలన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్, చంద్రయ్య, కిరణ్ కుమార్, రాం బాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ల పనులు


పనులు చేస్తున్న కూలీలు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 17: పేదవాడి కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్లు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జిల్లాలోని అన్న క్యాంటీన్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో అన్న క్యాంటీన్లను ఆగస్టు 15న ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం

» బొల్లవరంలో డబ్బు కట్టినా కనెక్షన్ ఇవ్వని అధికారులు
» జల్‌జీవన్ మిషన్ లక్ష్యం నెరవేరక అధికారుల సతమతం
» తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం


బొల్లవరంలో కరెంట్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్

కల్లూరు, జూలై 17: విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల బొల్లవరం, కొంగనపాడు గ్రామాల్లో శుద్ధజలం అందడం లేదు. ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం అధికారులు జల్‌జీవన్ మిషన్ కింద రూ.47 లక్షలు వెచ్చించి బొల్లవరంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తి చేశారు. అయితే సంవత్సరాలు గడిచినా ప్రజలకు తాగునీరు అందడం లేదు. పలు మార్లు సమస్యను మండల అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జల్‌జీవన్ మిషన్ పథకం పూర్తిచేసి ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని చూసిన అధికారులకు విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ కనెక్షన్ ఇవ్వకుండా చుక్కలు చూపిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

● డబ్బులు కట్టినా కనెక్షన్ ఇవ్వని అధికారులు:

బొల్లవరం గ్రామంలో వాటర్‌ట్యాంకు కరెంట్ కనెక్షన్ కోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆగస్టు 2022లో విద్యుత్ అధికారులను సంప్రదించారు. విద్యుత్‌శాఖ ఏడీఈ ఖర్చు రూ.5.35 లక్షలు అవుతుందని తెలిపినట్లు సమాచారం. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆ దిశగా ఫైల్‌ను కదిలించినా డిపార్ట్‌మెంట్ అనుమతి రావడానికి 6 నెలలు సమయం పట్టిందని అన్నారు. విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఏడీఈ సుబ్బన్నను ఆర్‌డబ్ల్యూఎస్ మండల అధికారి కోరగా కాలం గడవడంతో ధరలు పెరిగాయని, ఇప్పుడు ఆ రేటుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేమని రివైజ్డ్ ఎస్టిమేషన్ ఇచ్చారు. మండల అధికారులు రెండవ ధఫా రూ.75 వేలు ఫిబ్రవరిలో చెల్లించి విద్యుత్ కనెక్షన్ అడగ్గా నేటికి అధికారులు పనిపూర్తి చేయలేదని అంటున్నారు.

ప్రజలు నుంచి ఒత్తిడి అధికంగా ఉంది

జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా బొల్లవరం, కొంగనపాడులో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తి చేశాం. 2022లో విద్యుత్‌శాఖకు డబ్బులు చెల్లించాం. రివైజ్డ్ ఎస్టిమేషన్ వేస్తే 2024 ఫిబ్రవరిలో రూ.75 వేలు చెల్లించాం. అయినా విద్యుత్‌శాఖ అధికారులు కనెక్షన్ ఇవ్వలేదు స్థానిక ఎమ్మెల్యేకు పరిస్థితిని వివరించాం.

- శ్రీనాథ్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

డబ్బు సరిగా పంపలేదు

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌కు పంపాల్సిన రూ.75వేలు సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌కు పంపారు. అమౌంట్ ట్రాన్స్‌ఫర్ కోసం లేటర్ పెట్టాం. వర్క్ ఆర్డర్ రాగానే పని ప్రారంభిస్తాం.

- ఏడీఈ సుబ్బన్న

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

డయేరియా తగ్గేంత వరకు వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి

● ఆదోని ఏరియా హాస్పిటల్‌ను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



డయేరియా బాధితులను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని, జూలై 17: డయేరియా తగ్గేంత వరకు గ్రామంలో వైద్యాధికారులు నిత్యం అందుబాటులో ఉండాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. బుధవారం ఆదోని ఏరియా ఆసుపత్రిలో అతిసార వ్యాధితో బాధపడుతున్న మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామ వాసులను సబ్ కలెక్టర్ పరామర్శించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ వైద్యాధికారులు నిత్యం అందుబాటులో ఉండి అతిసార బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం మంత్రాలయం మండలం సుంకేశ్వరీ గ్రామంలో మెడికల్ క్యాంపు, శానిటేషన్, వాటర్ ట్యాంకు ద్వారా తాగునీటి సదుపాయం, వివిధ సదుపాయాలను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. వానాకాలం అయినందున ప్రజలు నీటిని కాచి తాగేలా అవగాహన కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. గ్రామంలో డయేరియా లేదా ఇలాంటి వ్యాధులతో బాధపడే వారు వెంటనే సంబంధిత పీహెచ్‌సీ డాక్టర్లను సంప్రదించాలని సబ్ కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పని చేసిన కార్యకర్తలకు న్యాయం : టీడీపీ

తుగ్గలి, జూలై 17: ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి తిమ్మయ్య చౌదరి, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం పని చేసిన కార్యకర్తలను, నాయకులను పార్టీ గుర్తిస్తుందని, వారికి తగ్గ ఫలితం దక్కుతుందని పేర్కొన్నారు. ఒకేసారి అందరికీ న్యాయం జరగకపోయినా.. దశలవారిగా న్యాయం జరుగుతుందని ఎవరూ అధైర్యపడవద్దని సూచించారు. సీఎం చంద్రబాబు నాయుడు సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా చేపడుతున్నారని, ఇప్పటికే రాష్ట్రంలో 30 రోజుల్లోనే ఎన్నో సంక్షేమ పథకాలను అందించారని, ఇచ్చిన వాగ్దాలన్నింటినీ నెరవేరుస్తున్నారని వివరించారు.

బెదిరింపులకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి



డీఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 17: తాము జర్నలిస్టులమని చలామణి అవుతున్న సోషల్ మీడియా వారిని కట్టడి చేయాలని ఆదోని జర్నలిస్ట్ సంఘం నాయకులు బత్తిని మల్లికార్జున, మునెప్ప, ఎరుకల రవికుమార్, రాము, షంషీర్ ఖాన్, వీరేష్, విజయ్, పురుషోత్తం కోరారు. బుధవారం డీఎస్పీ శివనారాయణ స్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తాము జర్నలిస్టులమంటూ సోషల్ మీడియాకు చెందిన కొంతమంది అధికారులను బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తమ వాహనాలకు ప్రెస్ స్టిక్కర్లు అతికించుకొని తిరుగుతున్నారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొంది, ఐఅండ్‌పీఆర్ నుంచి అక్రిడేషన్ పొందిన నిజమైన జర్నలిస్టుల విలువలను కాపాడాలని కోరారు. పత్రికా సమావేశాలకు వారిని దూరంగా ఉంచాలని కోరారు. జర్నలిస్టులు చిన్న, ఎం రవికుమార్, అబ్బురం రాజు, తిమ్మప్ప, భీమా, సునీల్, మురళి, నవీన్ పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఏపీ టీచర్స్ గిల్డ్ సభ్యులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 17: పట్టణంలోని ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తూ ఇటీవల పదవి విరమణ పొందిన ఎల్కే. చిన్నప్ప, రత్నం, కిషోర్, వసంత, నాగమణిలను బుధవారం ఏపీ టీచర్స్ గిల్డ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. స్థానిక నేషనల్ పాఠశాలలో జరిగిన సన్మాన కార్యక్రమానికి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి, చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కేశవయ్య మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయులుగా పనిచేసి ఎంతోమందిని ఉన్నతంగా తీర్చిదిద్దారని అభినందించారు. కార్యక్రమంలో రంగారెడ్డి, జయరాం, హుస్సేన్, శ్రీధర్, నాగభూషణం, మధుసూదన్, మారెన్న పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్

ఆదోని (అగ్రికల్చర్), జూలై 17: గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల వీలిన ప్రక్రియకు సంబంధించి విడుదల చేసిన జీవో 117ను రద్దుచేసి, ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ కోరారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో జిల్లా ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 3,4,5, తరగతుల వీలినం వల్ల రాష్ట్రంలోని 18వేల ప్రాథమిక పాఠశాలలో మూతపడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరు లక్షల మందికి పైగా పేద, గ్రామీణ ప్రాంత బాలబాలికలు డ్రాప్ అవుట్ అయి, చదువులకు దూరమయ్యారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ జీవోను రద్దుచేసి ప్రాథమిక విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీలు 50వేల పైగా ఉన్నాయని, మెగా డీఎస్సీ వెంటనే ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అఖండ, కార్యదర్శి మహేంద్ర బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, సహాయ కార్యదర్శి మల్లికార్జున, నరేష్, వినోద్ పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం



కౌతాళంలో భక్తులకు తాగునీరు అందిస్తూ..



కౌతాళంలో..



ఆదోనిలో..



కోసిగిలో..



క్రిష్ణగిరిలో..



తుగ్గలిలో..



హొళగుందలో..



మద్దికెరలో..

మతసామరస్యానికి ప్రతీకగా జిల్లా వ్యాప్తంగా వేడుకలు

జిల్లా వ్యాప్తంగా మతసామరస్యం వెల్లివిరిసేలా మొహర్రం వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కర్బాలా యుద్ధంలో మహమ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ ఉస్సేన్‌తో పాటు అనుచరుల వీర మరణానికి గుర్తుగా, త్యాగానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆయా గ్రామాల్లో పది రోజులపాటు పీర్లను ఊరేగించి పెద్దసరిగెత్తు ముగిశాక తెల్లవారుజామున పీర్లదేవుళ్లు ఊరేగింపుగా భయలుదేరారు. మొక్కుబడులు ఉన్న భక్తులు తమ ఇళ్లవద్ద స్వామివార్లకాళ్లకు నీళ్లుపోసి కోరికలుచెప్పుకున్నారు. సాయంత్రం పూడ్చిన అలాయిగుంతకు దారాలుకట్టి భక్తులు మొక్కులు కోరారు. యువకులు, మహిళలు, పిల్లలు బుక్కిపిండిని (రంగు) ఒకరిపై ఒకరుచల్లుకుంటూ అలాయిబలాయి (ఆలింగనం) చెప్పుకున్నారు. యువకులు పలు వేషాధారణలతో ఊరేగింపులో భక్తులను అలరించారు. హస్సయి దులా హారతి.. అంటూ డప్పుల చప్పుళ్లకు అనుగుణంగా సవార్లను ఆడిస్తూ సంబరాలు చేసుకున్నారు. మొక్కుబడిలో భాగంగా చివరిరోజు అలాయిగుంతల వద్ద సాహుసేన్.. సద్‌సేన్ అంటూ పీర్ల వెంట యువకులు నృత్యాలను చేశారు. సాయంత్రం ఊరేగింపుగా పీర్లదేవుళ్లు ఏటికి తరలివెళ్లారు. రాత్రి ఆయా చావిళ్ల నిర్వాహకులు విషాదగీతాలుపాడుకుంటూ పీర్లదేవుళ్ల ప్రతిమలు, బట్టలను పెట్టెలలో చావిళ్లకు చేర్చారు. పత్తికొండ నియోజకవర్గంలోని చక్కరాళ్ల గ్రామంలో ప్రత్యేకంగా నిర్వహించే సాహుసేన్ చూసేందుకు బయటి ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. నందవరం మండలం ముగతి గ్రామంలో పులివేశం, దౌడలకు కత్తి శూలలాలు గుచ్చుకుని గుండ్రాయిని పైకి ఎగరేస్తూ భక్తిని చాటుకున్నారు. 500 మంది వేటకొడవళ్లు, కత్తులు, గొడ్డలతో ద్యగిరయ్య ఆలయం నుంచి చావిడి మీదగా పీర్ల మొక్కులు తీర్చుకొని యథాస్థానానికి చేరుకున్నారు. కొన్నిగ్రామాల్లో గతంలో చోటుచేసుకున్న సంఘటనల నేపథ్యంలో పోలీసులు సావ్‌సేన్ ఆడేందుకు అనుమతులు ఇవ్వకపోవడంతో సావ్‌సేన్ లేకుండానే మొహర్రం జరుపుకున్నారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు





ఆదోనిలో పాండురంగ స్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు, పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 17: జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆదోని విక్టోరియాపేట పాండురంగ స్వామి దేవాలయం, ఇస్వి గ్రామానికి వెళ్లే రహదారిలోని నల్లగొండ పాండురంగ స్వామి దేవాలయంలో తెల్లవారుజామునే ప్రత్యేక అలంకరణ, అభిషేకం, హారతి వంటి ప్రత్యేకపూజలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు వేకువజామునే భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి పాదదర్శనం కల్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం స్వామి వారి పల్లకీసేవ పురవీధులలో నిర్వహించారు. విక్టోరియాపేట పాండురంగ స్వామి దేవాలయంలో ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆదోని రూరల్: తొలి ఏకాదశి పూజల సందర్భంగా ఆదోనిలోని రుక్మిణి పాండురంగ స్వామి, వెంకటేశ్వరస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా వేద పండితులు స్వామివార్లను బంగారు, వెండి ఆభరణాలతో, వివిధ రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పత్తికొండ: పత్తికొండ శ్రీవెంకటేశ్వరస్వామిదేవాలయం, రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఆయాఆలయాల్లో స్వామివారికి అభిషేక కార్యక్రమాలను జరిపించారు. అనంతరం స్వామివారి ఉత్సవవిగ్రహాలను పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా రంగనాథ స్వామి కల్యాణోత్సవం

మద్దికెర : పెరవలి గ్రామంలోని రంగనాథ స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని తిరుమంజనసేవా కార్యక్రమం వైభవంగా జరిగింది. మూలవిరాట్ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కళ్యాణకట్ట మీద ఆలయ ప్రధాన అర్చకులు రంగనాథుల ఆధ్వర్యంలో భూదేవి శ్రీదేవి రంగనాథస్వామి తిరుమంజనసేవలో భాగంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

గోనెగండ్ల : మండల కేంద్రమైన గోనెగండ్లలో ఉదయం నుంచే యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో వైష్ణవ దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక చింతలాముని, నల్లారెడ్డి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకు పూజ, మహామంగళహారతి నిర్వహించారు. తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు.

23న పులి కనుమ చేపల చెరువు వేలంపాట

కోసిగి, జూలై 17: కోసిగి మండల పరిధిలో ఈ నెల 1వ తేదీ నుంచి 30.06.2025 వరకు బహిరంగ వేలం ద్వారా పులికనుమ బ్యాలెన్సింగ్ రిజర్వాయరులో చేపలు పట్టేందుకు లీజుకు వేలం పాటను ఈ నెల 23న ఉదయం 11 గంటలకు కోసిగి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు సహాయ మత్స్య పర్యవేక్షకులు డి.నాగరాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలంలో పాల్గొనదలచినవారు ఆధార్‌తో పాటు రూ.10వేలు నగదు కట్టి బహిరంగ వేలాల్లో పాల్గొనాలని, వేలంలో అధిక పాట పాడిన వారికి లీజుదారుడుగా నిర్ణయిస్తామని తెలిపారు. వేలంపాటలో ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం రాకపోతే బహిరంగ వేలం రద్దు పరిచే అధికారం సహాయ మత్స్య పర్యవేక్షకులకు ఉంటుందన్నారు.

బనవాసి ఫారంలో నేడు ఎమ్మెల్యే పర్యటన

● కేవీకే, పాలిటెక్నిక్, లైవ్‌స్టాక్ కేంద్రాలను పరిశీలించనున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, జూలై 17: బనవాసి ఫారంలో ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి గురువారం పర్యటించనున్నారు. ఫారం పరిదిలో ఉదయం 11గంలకు కృషివిజ్ఞాన కేంద్రం, 12గంలకు వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, గొర్రెల, మేకల పరిశోధనాక్షేత్రం, ఒంటి గంకు ఘనీకృత వీర్యఆబోతు కేంద్రాలను పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్ష చేయనున్నారు.

విద్యుత్ వైరు చోరీ

ఎమ్మిగనూరు, జూలై 17: పట్టణంలోని సాయినగర్‌లో శివారెడ్డి అనే వ్యక్తి కొత్తగా నిర్మిస్తున్న ఇంట్లో విద్యుత్‌వైరును దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బుధవారం శివారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి సంబంధించిన విద్యుత్ వైరు ఓ గదిలో ఉంచి తాళం వేశారు. అయితే మంగళవారం రాత్రి దొంగలు గది తలుపుల తాళాన్ని తొలగించి ఇంట్లో ఉన్న రూ. 15 వేల విలువ చేసే వైరును ఎత్తుకెళ్లారు. గతంలో శిల్పా ఎస్టేట్‌లో రెండు మూడు ఇళ్లలో ఇలాగే దొంగలు చోరీలకు పాల్పడి రూ. లక్షల విలువ చేసే విద్యుత్ వైరును చోరి చేశారు.

ఎంపీ విజయసాయిరెడ్డిని బర్తరఫ్ చేయాలి

● జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల ఆందోళన

ఆదోని (అగ్రికల్చర్), జూలై 17: జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఆదోని జర్నలిస్టు సంఘం నాయకులు బత్తిని మల్లికార్జున, మునెప్ప, ఎరుకల రవి, షంషేర్ ఖాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జర్నలిస్టులు భీమాస్ కూడలిలో నిరసన తెలిపి డీఎస్పీ శివ నారాయణ స్వామికి వినతి పత్రం అందజేశారు. ఎంపీ విజయసాయిరెడ్డి, అసిస్టెంట్ దేవదాయ శాఖ కమిషనర్ శాంతి వ్యవహారంపై మీడియా ప్రతినిధులు తన ప్రెస్‌మీట్‌లో ప్రశ్నలు అడిగిన జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, గౌరవం లేకుండా "ఏరా.. వాడు.." అంటూ సంబోధించి అవమానకరంగా మాట్లాడడం మంచిది కాదని హితవు పలికారు. జర్నలిస్ట్ సంఘ నాయకులు, చిన్న, రాము, విజయ్, ఎం రవికుమార్, పురుషోత్తం, సుధాకర్ పాల్గొన్నారు.

మంత్రాలయం : ఎంపీ విజయసాయిరెడ్డిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఏపీయూడబ్ల్యూజే మంత్రాలయం తాలుకా అధ్యక్షుడు వగరూరు జయరాజు డిమాండ్ చేశారు. బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లో నిరసన తెలిపి మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. నాయకులు హుశేనీ, సూర్యనారాయణాచార్, సాబువలి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : జర్నలిస్టులు, మీడియా యాజమాన్యాల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఏపీయుడబ్ల్యూజే తాలుక,పట్టణ అధ్యక్షకార్యదర్శులు శ్రీనివాసులు, నాగరాజు, పరమేష్, సీపీఐ నాయకులు రంగన్న, సీపీఎం నాయకులు రాముడు, రైతుకూలీ సంఘం, మగ్బుల్, ఐఎఫ్‌టీయూ నాయకులు ఏసేపు, హనీఫ్ డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మిగనూరులో విలేకరులు, విద్యార్థి సంఘాల నాయకులు సోమప్ప సర్కిల్, తహసీల్దార్ కార్యలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.



మంత్రాలయంలో నిరసన తెలుపుతున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

పత్తికొండ టౌన్: జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని పదవి నుంచి తొలగించాలని ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టుల సంఘం నాయకులు రంగన్న, సాలు రంగడు, రాజేష్, మల్లికార్జునలు డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలో గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపి గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు వినతి పత్రం సమర్పించారు.

పచ్చదనానికి ప్రోత్సాహకాలు ప్రకటించాలి

ఆదోని టౌన్, జూలై 17: వాతావరణంలో జరుగుతున్న ప్రమాదకర పరిస్థితిలను అధిగమించడం కోసం పట్టణంలో పచ్చదనం పెంచే కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సామాజిక కార్యకర్త నసీరుద్దీన్ పటేల్ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిను కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రాంతంలో ఇటీవల పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా అనేకమంది మృత్యువు వాత పడటం ఎంతో విషాదకరమని, ఈ పరిస్థితి ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. పట్టణంలోని అన్ని మునిసిపల్ ఖాళీ స్థలాలలో మొక్కలు నాటడంతో పాటు, నివాసిత ప్రాంతాల్లో మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపించే వారికి ఆస్తిపన్నుల చెల్లింపులో ఐదు శాతం రాయితీ ప్రకటించాలని కోరినట్లు తెలిపారు.

ఎస్పీని కలిసిన టీడీపీ నేత వీరభద్రగౌడ్

ఆలూరు, జూలై 17: జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బిందు మాధవ్‌ను బుధవారం ఆలూరు టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతలు పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సుదర్శన హోమం చేసిన పీఠాధిపతి

మంత్రాలయం, జూలై 17: వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సుదర్శన హోమాన్ని నిర్వహించారు. బుధవారం బెంగుళూరు జయానగర్ రాఘవేంద్రస్వామి మఠంలో ప్రథమ ఏకాదశిని పురస్కరించుకొని భక్తులకు తప్త ముద్రధారణ చేశారు. అనంతరం మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు అభిషేకాలు చేసి హారతులు ఇచ్చారు. వేలాది మంది తొలి ఏకాదశి పూజల్లో పాల్గొని ముద్రదారణ చేయించుకున్నారు.

భక్తులకు రాఘవేంద్రుని నిజ బృందావన దర్శనం

రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా బృందావనంకు నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠం పండితుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనంను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మొహర్రం సెలవు దినం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కోటేకల్‌లో ఘర్షణ

ఎమ్మిగనూరు, జూలై 17: మండల పరిదిలోని కోటేకల్ గ్రామంలో బుధవారం మొహర్రం వేడుకల్లో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పీర్ల పండుగ ముగింపు సందర్భంగా ఊరేగింపులో ఓ సామాజిక వర్గం సావుసోని ఆడేందుకు ప్రయత్నించారు. దీన్ని మరో సామాజిక వర్గం అడ్డుకోవటంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకొని ఘర్షణకు దారితీసింది. కొంతమంది గ్రామస్థులు వారించేందుకు ప్రయత్నించినప్పటికీ పట్టించుకోకుండా ఒకరిపై ఒకరు రాళ్లతోను, కట్టెలతో కొట్టుకున్నారు. ఇరువర్గాలకు చెందిన పదిమందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జీ డీఎస్పీ శివనారయణ స్వామి కోటెకల్లుకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గాయపడిన ఇరువర్గాల వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ఎమ్మిగనూరు టౌన్,జూలై 17 : ఎమ్మిగనూరు పట్టణంలో మంగళవారం రాఘవేంద్ర కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదంలో గుడిసె కాలిపోయింది. దాదాపు రూ15లక్షలు ఆస్తీ నష్టం జరిగింది. ఇందుకు స్పందించిన ఎమెల్యే బీవీ జయనాగెశ్వరరెడ్డి బాధితులను పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకుంటామని అధైర్య పడొద్దని వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. బుధవారం రెవెన్యూ అధికారులతో మాట్లాడి బాధితులకు నిత్యవసర సరుకులు 120 కిలోల బియ్యం 15రోజులకు సరిపడా సరుకులు, బట్టలు, రూ. 5 వేల ఆర్థిక సాయం నగదును రిటైర్డ్ ఉద్యోగి వెంకటెశ్వర్లు, మల్లయ్య వార్డు నాయకుల ద్వారా అందించారు. అలాగే కలెక్టర్‌తో మాట్లాడి బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలని, వారికి సాయం అందించాలని కొరారు.

మల్లెల అల్‌ఫ్రెడ్ రాజ్ ఆర్థిక సాయం

రాఘవేంద్ర కాలనీలో గుడిసె దగ్ధమైన సమాచారం తెలుసుకున్న ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి మల్లెల అల్‌ఫ్రెడ్ రాజ్ బాధితులను పరామర్శించి వారికి రూ20వెల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని అల్‌ఫ్రెడ్ రాజ్ తెలిపారు. ఆయన వెంట డీవైఎఫ్ఐ నాయకులు అజిత్, సతీష్, 24వ వార్డు కౌన్సిలర్ బజారి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఆలూరు, జూలై 17: ఖరీఫ్‌లో రైతులకు సబ్సిడీ విత్తనాలు సరఫరా చేసి ఎన్టీఆర్ రైతు భరోసా పథకం ద్వారా ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి రామాంజినేయులు అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలూరు పార్టీ కార్యాలయంలో ఈ నెల 21వ తేదీన ఆంధ్రప్రదేశ రైతు సంఘం ఆలూరు తాలూకా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జగన్నాథం, జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో రైతు సంఘ కార్యదర్శి సీ గోపాల్, రాముడు, శేఖర్ ఈరన్న, సూరి, వరదరాజులు, తిక్కన్న, ఓబులేసు, గోవిందరాజు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తి గౌరవప్రదమైనది

ఆదోని టౌన్, జూలై 17: ఎన్నో వివాదాస్పదమైన సమస్యల పరిష్కారం కోసం న్యాయవాదులు గౌరవప్రదమైన పాత్రను పోషిస్తారని ఆర్యవైశ్య, అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా అన్నారు. బుధవారం అంతర్జాతీయ న్యాయదినోత్సవ సందర్భంగా స్థానిక న్యాయవాదులు రవీంద్ర, చిన్న ఈరన్న, బాల త్రివేణిలను ఘనంగా సన్మానించారు. ఈ వృత్తిలో మహిళలు కూడా అధిక సంఖ్యలో తమ సేవలు అందించడంతో, సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు ఎంతో ఊరటను కలిగిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రఘు, వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, మహిళ విభాగ కార్యదర్శి వంకదారు మమతాశ్రీ పాల్గొన్నారు.

పంట నాశనం చేశారు

మద్దికెర, జూలై 17: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలోని తన పొలంలోని డ్రిప్పును, పంటను గ్రామానికి చెందిన రాజు నాశనం చేశాడని గుంతకల్లు పట్టణానికి చెందిన రమేష్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఎస్ఐ రమేష్‌బాబును కలిసి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. 2017లో భూమి కొనుగోలు చేశానని, పొలంలో బోర్లు వేసి డ్రిప్పు కూడా పెట్టుకున్నానని తెలిపారు. గ్రామానికి చెందిన రాజు, పక్కీరప్ప డ్రిప్పుంతా కాల్చేసి తనను నష్టపర్చారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదైందన్నారు. రెండు రోజుల క్రిందట సాగు చేసిన కంది పంటను రాత్రి సమయంలో అక్రమంగా దున్నేశాడని ఆరోపించారు. సదురు వ్యక్తి తనను ఇబ్బందులకు గురి చేస్తున్నాడంటూ ఎస్ఐకి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.